

భావములో భంగిమలో సహజత్వాన్ని ఉట్టిపడేలా అభినయిస్తున్న నీలిమ, విద్య, వేదాంతం వెంకటా చలపతి.

# నాట్యవేదానికి గుడి... కూచిపూడి

## రంజింపచేసిన తొలినాటి నృత్యాలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 9 (న్యూస్‌టుడే): ఢిల్లీ సంగీత నాటక అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న కూచిపూడి నృత్యోత్సవాన్ని ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర గవర్నర్ కృష్ణకాంత్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎనిమిది రోజుల పాటు నిర్వహించే ఈ కూచిపూడి నృత్యోత్సవం విజయవంతం

కావాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు జి.కిషన్‌రావు ఆకాంక్షిస్తూ నృత్యోత్సవంలో పాల్గొన్న కళాకారులకు స్వాగతాభినందనలు తెలిపారు. ఈ కూచిపూడి నృత్యోత్సవం కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన పూర్వరంగంతో ప్రారంభమైంది. ముందుగా దేవతాస్తుతి, పుణ్యాహ వచనం, వినాయకౌత్వం 'తాండవ నృత్య గజానన' అంబా పరాకు, దేవీపరాకు మమ్మేలు మాతా శారదాంబా పరాకు' ప్రదర్శించారు. పూర్వరంగంలో చింతా రవిబాలకృష్ణ వినాయకుడిగా, సూత్రధారులుగా వేదాంతం రాఘవయ్య, ఐ.సోమేశ్వర ప్రసాద్, ధనుంజయ, రమాదేవి, సుధారాణి, సుందరి - నీరజ, మాయినీ, యశోదలు అభినయించారు. తర్వాత సిద్ధేంద్ర యోగి విరచితమైన 'భామాకలాపం' నృత్య ప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంది. భామాకలాపంలో ప్రవేశదరువు, 'భామనే సత్యభామనే సిగ్గాయనోయమ్మా, 'ఎందుబోతివి.. ఎందుబోతివిరా', 'వాదమేల పోవే... నానాథుని ఇటు తేవే', 'రాజీలాక్షుడు గోపాలుడు - రాధాలోలుడు', 'కోమలి నాపై కోపమేలనే', 'బంగారు పూల పూజ సేత వాటి సారంశాలను నవరసభరితంగా అభినయించి ఆహా! అనిపించారు. ప్రధానంగా వేదాంతం వెంకటాచలపతి సత్యభామ వేషంలో స్త్రీ లాలిత్యం, సౌకుమార్యం, దర్పం, అభినయ కౌశంలతో వైవిధ్యంగా ప్రదర్శించారు. కాగా మాధవి - సత్యభామల సరస (ప్రియోక్తులు) చమత్కార సంభాషణలు సహజత్వాన్ని చాటాయి. శ్రీకృష్ణునిగా కురవి సుబ్రహ్మణ్య ప్రసాద, మాధవిగా వేదాంతం రాఘవయ్యలు అలరించారు. 'భామాకలాపం' తర్వాత ఐ.సోమేశ్వరప్రసాద్ అజయ్‌లు', 'వినాయక కౌత్వం' రాగమాలికలో అభినయించారు. 'బృందావని నిలయే' అంశాన్ని రీతిగాళ రాగంలో జె.రమాదేవి, సిహెచ్.సుధారాణి, సుందరి, నీరజల, యామిని, యశోదలు మనోహర నృత్యాలతో కనువిందు చేశారు. నర్తకి రంగనాయికి 'తరంగం', ఏలేశ్వరపు శ్రీనివాస్ - 'అష్టపది'ని అభినయించి ఆకట్టుకున్నారు. వీరి నృత్యాలకు నట్టువాంగం వేదాంతం రత్తయ్య శర్మ, గాత్రం పసుమర్తి కేశవప్రసాద్, సిహెచ్.శాంతి, మృదంగం సుబ్రహ్మణ్యం వాద్య సహకారం అందించారు. విశాఖపట్నం కూచిపూడి కళాక్షేత్రానికి చెందిన కళాకారులు దివ్య, విద్య, మానస, శైలజలు 'సొగసుగా మృదంగ తాళం', దివ్య - నీలిమలు 'తులసీదాస్ భజనలు', విద్య, నీలిమ, మానసలు, 'అష్టలక్ష్మి వైభవం', 'శివ పంచాక్షరం' అందరూ కలిసి నర్తించి నేత్రపర్వం చేశారు. వీరి నృత్యాలకు గురువు శ్రీమతి బాల కొండలరావు గాత్రం - వరహాలు, మృదంగం - కాంతిలాల్ శ్రీహరి, ఫ్లూటు - అచ్యుతరావు, వీణ - నారాయణమూర్తి వాద్య సహకారం సమకూర్చారు.